సాక్షి
సిద్దిపేట
బుధవారం । 20 । డిసెంబర్ । 2023



అక్కన్నపేట దశ మారేనా?

పొన్నం ప్రభాకర్ మంత్రి పీఠాన్ని అధిష్టించడంతో అక్కన్నపేట మండల అభివృద్ధిపై ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. వివరాలు 8లో ▸



ప్రశాంత్‌పై కక్షసాధింపు తగదు

కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్న బిగ్‌బాస్ సీజన్–7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌పై కక్షసాధింపు చర్యలు తగవని డాక్టర్ రాజేశ్‌కుమార్ అన్నారు. వివరాలు 8లో ▸



డబుల్ ఇళ్లను కేటాయించాలి

సర్వే చేసి అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

విద్యతోనే సమాజం పురోభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



రామంచలో విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజా చైతన్యం విద్యతోనే సాధ్యమని, అదే సమాజ పురోగతికి మార్గమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో సిద్దిపేట లయన్స్ క్లబ్ సహకారంతో 160 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అలవరుచుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రామంచ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. మారు మూల పల్లెల్లో లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ దేశిరెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గంప రమేశ్, సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

సిద్దిపేటరూరల్: ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల కోసం గజ్వేల్ మిట్రాజీపల్లి మోడల్‌స్కూల్ ప్రాంగణంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి నీల రాఘవేందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ.10,600 నుంచి 15వేల వరకు వేతనం ఇవ్వనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు వారి బయోడేటా , విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 82476 56356, 98853 46768 నంబర్లను సంప్రదించాలని కోరారు.

21, 28 తేదీల్లో సదరం శిబిరం

సిద్దిపేటరూరల్: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 21, 28 తేదీల్లో సదరం శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే ఈ శిబిరాన్ని అర్హులైన దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరు కావాల్సిన వికలాంగులు తమ దగ్గరలో ఉన్న మీసేవ, ఈ సేవ సెంటర్‌లో తమకు సంబంధించిన వైకల్యంతో ఆన్‌లైన్ స్లాటు బుకింగ్ ఫారం– ఏ నమోదు చేయించుకోవాలన్నారు. దరఖాస్తు రశీదు, ఆధార్ కార్డు కాపీతో కోమటి చెరువు దగ్గరలో గల ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

బిగ్‌బాస్ విజేతకు హరీశ్‌రావు అభినందనలు



ప్రశాంత్‌కు ఫోన్‌లో అభినందనలు తెలుపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్‌రూరల్: బిగ్‌బాస్ సీజన్ –7 విజేత పల్లవి ప్రశాంత్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని కొల్గూరు గ్రామానికి చెందిన పల్లవి ప్రశాంత్ బిగ్‌బాస్ విన్నర్‌గా నిలిచి తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ మంగళవారం కొల్గూరులో పల్లవి ప్రశాంత్‌తో పాటు అతని తల్లిదండ్రులకు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ ద్వారా పల్లవి ప్రశాంత్‌కు అభినందనలు తెలుపుతూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ... తన సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు.

సర్వే ఇక వేగిరం

తప్పనున్న టిప్పన్ తిప్పలు

- త్వరలో మెదక్ నుంచి రానున్న రికార్డులు
- ఇటీవల కరీంనగర్, వరంగల్ నుంచి వచ్చిన దస్త్రాలు
- జిల్లాలో 386 రెవెన్యూ గ్రామాలు
- 2.10లక్షల సర్వే నంబర్లు





జిల్లాకు చేరిన పలు మండలాల భూ రికార్డులు

సాక్షి, సిద్దిపేట: భూ సర్వే ఇక వేగిరం కానుంది. భూమి కొలతల కోసం అవసరమయ్యే టిప్పన్, సేత్వార్, మ్యాప్‌ల తిప్పలు తప్పనున్నాయి. జిల్లాగా సిద్దిపేట ఏర్పాటైనప్పటికీ భూములకు సంబంధించిన దస్త్రాలన్నీ పాత జిల్లాలోనే ఉన్నాయి. దీంతో సర్వే సమయంలో రికార్డుల కోసం సర్వేయర్లు వెళ్లి వచ్చి సర్వేను నిర్వహించే వారు. ఇలా చేయడంతో సర్వే ఆలస్యమయ్యేది. కొత్త జిల్లాల వారీగా భూములకు సంబంధించిన దస్త్రాలను విభజన చేసి పంపిస్తున్నారు. సర్వేల కోసం ఎదురు చూస్తున్న రైతుల కష్టాలు తీరనున్నాయి.

జిల్లాలో 26 మండలాలు..

కరీంనగర్ జిల్లా నుంచి హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, బెజ్జంకి మండలాలు వరంగల్ నుంచి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దుల్మిట్ట మండలాలతో పాటు మెదక్ జిల్లాకు సంబంధించి 18 మండలాలతో సిద్దిపేట జిల్లాగా 2016లో ఏర్పాటైంది. జిల్లాలో 26 మండలాలుండగా 386 రెవెన్యూ గ్రామాలు, 2.10లక్షల సర్వే నంబర్లున్నాయి.

భూ దస్త్రాల కోసం పరుగులు

జిల్లాలో సాగు నీళ్ల అందుబాటులోకి రావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో హద్దుల సమస్యలు తలెత్తుతున్నాయి. వివాదాల పరిష్కారం కోసం భూమి సర్వే చేయించాలి. సర్వే కోసం భూ కొలతల కార్యాలయంలో చలానాలు చెల్లిస్తున్నారు. అయితే అవసరమైన భూ దస్త్రాలు అందుబాటులో లేకపోవడంతో వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. భూములకు సంబంధించిన టిప్పన్, మ్యాప్‌లు, సేత్వార్‌లు ఉంటేనే సర్వేయర్లు సర్వే చేసేవారు. లేకపోతే ఆ భూముల సర్వేలు పెండింగ్‌లోనే ఉండేవి. వారం రోజులకు ఒక సారి ఆయా జిల్లాలకు వెళ్లి భూములకు సంబంధించిన మ్యాప్‌లు అన్ని సర్వేయర్‌లు తీసుకువచ్చే వారు. ప్రజాప్రతినిధులు, రైతులు పలు మార్లు విన్నవించినా భూములకు సంబంధించిన టిప్పన్, మ్యాప్, సేత్వార్‌లు పంపించలేదు. రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఏ జిల్లాలకు సంబంధించిన భూమి దస్త్రాలను కొలత విభాగానికి పంపిస్తున్నారు. ఇప్పటి వరకు కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి 8 మండలాలకు సంబంధించి 97 రెవెన్యూ గ్రామాల టిప్పన్‌లు, మ్యాప్‌లు, సేత్వార్‌లు వచ్చాయి. త్వరలో మెదక్ జిల్లా నుంచి 289 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన భూముల దస్త్రాలు కొలతల శాఖకు చేరనున్నాయి.

త్వరలో మెదక్ నుంచి దస్త్రాలు

వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఉన్న టిప్పన్, మ్యాప్‌లు, సేత్వార్‌లు వచ్చాయి. త్వరలో మెదక్ జిల్లా నుంచి సైతం దస్త్రాలు రానున్నాయి. సర్వేల కోసం భూమి రికార్డులు తెచ్చేందుకు పాత జిల్లాలకు వెళ్లి తీసుకవచ్చి సర్వేలు నిర్వహించే వాళ్లం. ఇక మన జిల్లా నుంచే తీసుకుని సర్వే నిర్వహించనుండటంతో త్వరగా సర్వేలు పూర్తి కానున్నాయి.

–వినయ్ కుమార్, ఏడీ, భూ కొలతల శాఖ



ప్లాస్టిక్‌కు బదులుగా బట్ట సంచులు వాడాలని చూపుతున్న అధికారులు, సిబ్బంది

కొమురవెల్లి జాతరలో ప్లాస్టిక్ నిషేధం

- వినియోగిస్తే జరిమానా, చర్యలు
- అందరూ సహకరించాలి
- డీపీఓ దేవకి దేవి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న జాతరలో ప్లాస్టిక్ నిషేధమని, ప్రతి ఒక్కరూ సహకరించాలని డీపీఓ దేవకిదేవి అన్నారు. మంగళవారం కొమురవెల్లిలో స్వచ్ఛ కొమురవెల్లి– స్వచ్ఛ మల్లన్న పేరిట ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాల గురించి స్థానికులకు, దుకాణాదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఓ దేవకిదేవి మట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకు ఎంతో హానికరమన్నారు. జీఓ 40 ప్రకారం ప్లాస్టిక్‌వాడొద్దని, వినియోగిస్తే జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ సహకరిస్తే నిషేధం సాధ్యమవుతుందన్నారు. అలాగే తడి ,పొడి చెత్తను వేరు వేరుగా పారిశుద్ధ్యకార్మికులకు ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ కు బదులుగా ప్రత్యామ్నాయ మార్గలు వెతికి ప్లాస్టిక్ ను అరికట్టాలని అన్నారు. గతంతో పోలిస్తే కొంత మేరకు ప్లాస్టిక్ ను అరికట్టగలిగామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ సార్ల లత, జెడ్పీటీసీ సిద్దప్ప, ఏఈవో అంజయ్య, ఎంపీడీఓ అనురాధ, ఎస్ఐ నాగరాజు, దుకాణాదారులు, ఆలయసిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో సీల్డ్ టెండర్లు

కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి పట్నాల వస్త్రం, ఓం నమఃశివాయ టవల్స్, జరీ టవల్స్, జాకెట్ పీసులు అందజేసేందుకు 2024 సంవత్సరానికి సంబంధించి సీల్డ్ టెండర్లు అధికారులు మంగళవారం నిర్వహించారు. జరీ టవల్స్ రూ.12.15 పైసలకు, పట్నాలు వాడే తెల్ల వస్త్రం రూ.3.49 పైసలకు భువనగిరికి చెందిన వాజీద్ హ్యాండ్‌లూమ్స్ భూపాల్‌రెడ్డి తక్కువ కోడ్ చేసి లైసెన్సు పొందారు. అలాగే ఓం నమఃశివాయ టవల్స్ సరఫరా చేసేందుకు రూ.49 కోడ్ చేసి తాటి అన్నారానికి చెందిన నాగార్జున టెక్స్‌టైల్స్ ఏజెన్సీ హక్కు పొందింది. జాకెట్ పీసుల విషయమై రూ.20.89 పైసలకు వరంగల్‌కు చెందిన అనంతుల కేదారి క్లాత్ మార్చంట్ వారు తక్కువ కోడ్ చేసి హక్కు పొందారు.

ముంపు బాధితుల సమస్యలు పరిష్కరిస్తాం



ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ముంపు బాధితులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట ఆర్డీఓ రమేశ్, గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ బాల్‌రాజు, టీఎస్ఈఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్, డీఈ మక్బూల్, మిషన్ భగీరథ డీఈ సుమలతలతో కలిసి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని పల్లెపహాడ్, ఎర్రవల్లి, ఏటిగడ్డ కిష్టాపూర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముంపు బాధితుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గుట్టలు, రాళ్లు ఉన్న ప్రాంతంలో ప్లాట్ల ఏర్పాటుకు ఇబ్బందులు ఎదురైతే మరో ప్రాంతంలో కేటాయించాలని, అదే విధంగా ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ కోసం ఏర్పాటు చేసిన హద్దులు, జెండాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులతో పాటు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

- జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్
- గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువ పరిశీలన

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. మండల పరిధిలోని గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువను పరిశీలించారు. అలాగే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, నర్సరీని సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు సబ్జెక్టుకు సంబంధించి కొన్ని ప్రశ్నలు అడగ్గా ఎవరూ సరిగ్గా సమాధానాలు చెప్పలేదు. దీంతో సరిగా బోధించడంలేదంటూ ఉపాధ్యాయులను నిలదీశారు. అనంతరం గ్రామంలోని ఉపాధి కూలీలతో మాట్లాడారు. రోజు కూలీ ఎంత పడుతుందని, డబ్బులు ఎక్కడ జమ అవుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. దీంతో వారు బ్యాంక్ ఖాతాల్లోనే డబ్బులు జమ అవుతున్నాయని, రోజు వారీ కూలి సుమారు రూ.230వరకు వస్తున్నాయన్నారు. 150 పనిదినాలు కల్పించాలని పలువురు కూలీలు ఈ సందర్భంగా కోరారు. దీంతో ఆమె సానుకూలంగా స్పందించారు. అలాగే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్ డబ్బులు రావట్లేదని కొందరు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అంతముందు గౌరవెల్లి ప్రాజెక్టు కుడి కాలువను ప్రాజెక్టు ఈఈ రాములు నాయక్‌తో కలిసి పరిశీలించారు. కాలువ పొడవునా పెరిగిన ముళ్ల చెట్లు, పూడికతీతకు చర్యలు తీసుకోవాలని అధికారికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి(డీఆర్డీఓ) జయదేవ్, ఏపీడీ ఓబులాష్, ఎంపీడీఓ కొప్పుల సత్యపాల్‌రెడ్డి, ఏపీఓ ప్రభాకర్, టీఏలు ఉమేశ్, వినోద్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు నోటీసులు

దుబ్బాకటౌన్: స్థానిక పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలకు సంబంధించిన డబ్బులు 15 రోజుల్లోగా చెల్లించాలని జిల్లా కోఆపరేటివ్ అధికారి కరుణ పీఏసీఎస్ చైర్మన్ శేర్ల కైలాసం, మాజీ సీఈఓ అమ్మన లక్ష్మారెడ్డిలకు వేరువేరుగా నోటీసులు జారీ చేశారు. దుబ్బాక సహకార సంఘంలో 2022 జూన్‌లో రూ.35 లక్షలకు పైగా అక్రమాలు జరిగినట్లు వెలుగుచూడటంతో అప్పటి సీఈఓ లక్ష్మారెడ్డిని బాధ్యుడిగా చేస్తూ అయనను సస్పెండ్ చేయడంతో పాటు వెంటనే డబ్బులు చెల్లించాలని అధికారులు సూచించినప్పటికీ ఇంత వరకు రికవరీ కాలేదు. 15 రోజుల్లో డబ్బులు చెల్లించాలని తాజాగా నోటీస్‌లు జారీ చేశారు.

లోక్‌సభకు సన్నద్ధం

- పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన పార్టీల కసరత్తు
- లోక్‌సభ స్థానాలకు ఇన్‌చార్జిలను నియమించిన కాంగ్రెస్
- కృతజ్ఞత సభలతో శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న బీఆర్‌ఎస్
- 'వికసిత్ భారత్' పేరుతో బీజేపీ కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. ఇక పార్లమెంట్ ఎలక్షన్స్‌కు తెరలేవనుంది. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే ప్రజల్లోకి వెళ్తూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ దూకుడు చూపుతున్నాయి.



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలకు ప్రధాన పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. మూడు నెలల్లో ఈ ఎన్నికలకు షెడ్యూల్ వచ్చే అవకాశాలుండటంతో ఆయా పార్టీలు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నాయి. ఒకవైపు పార్టీ క్యాడర్‌ను సమాయత్తం చేస్తూనే.. మరోవైపు ప్రజల్లోకి వెళ్లేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హోరాహోరీగా పోరాడిన పార్టీలు ఇప్పుడు అదే స్థాయిలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా తలపడనున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలున్నాయి. మెదక్ పార్లమెంట్ స్థానం పూర్తిగా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఉండగా, జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో జహీరాబాద్ (ఎస్సీ), అందోల్ (ఎస్సీ), నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలున్న విషయం విధితమే.

పట్టు సాధించేందుకు...

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఇదే ఊపు కొనసాగించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటి నుంచి ఈ ఎన్నికలపై దృష్టి సారించింది. రెండు నియోజకవర్గాలకు ఇద్దరు సీనియర్ నేతలను పార్లమెంట్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలుగా నియమించింది. మెదక్ స్థానానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను, జహీరాబాద్‌కు మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డిని నియమించిన విషయం విధితమే. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంది. కానీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో రెండు చోట్ల విజయం సాధించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది.

భరోసా నింపుతూ..

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ., ఉమ్మడి మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ తన పట్టు నిలుపుకుంది. ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా విజయం సాధించేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఉమ్మడి జిల్లాలో గెలుపొందిన ఆయా నియోజకవర్గాల్లో కృతజ్ఞత సభలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ తన క్యాడర్‌ను పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని నిరుత్సాహానికి గురికావద్దని చెబుతూనే క్యాడర్‌లో భరోసా నింపుతోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలను బీఆర్‌ఎస్ గెలుచుకున్న విషయం విధితమే. ఈసారి అదే స్థాయిలో ఫలితాలను సాధించేందుకు కసరత్తు చేస్తోంది.

కేంద్ర పథకాలపై ప్రచారం

కేంద్రంలో మూడోసారి అధికారంలోకి రావడమే లక్ష్యంగా కమలం పార్టీ పార్లమెంట్ ఎన్నికల కోసం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం వికసిత్ భారత్ పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ఇటు బీజేపీ శ్రేణులు కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది. 'మా సంకల్పం అభివృద్ధి చెందిన భారతదేశం..' పేరుతో కేంద్రంలోని బీజేపీ సర్కార్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పథకాల ప్రచార వాహనాలను తిప్పుతోంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం.. ప్రధాన మంత్రి ఉజ్వలా యోజన పథకం.. పక్కా గృహాల నిర్మాణం.. ఇంటింటికీ నల్లా కనెక్షన్.. వంటి పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీ ముఖ్యనేతలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీలు పార్లమెంట్ ఎన్నికల కోసం ఇప్పటి నుంచి కసరత్తు ప్రారంభించాయి.

ఉచిత ప్రయాణ పథకాన్ని సవరించండి

ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని సవరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 9న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించినప్పటికీ పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఉచిత ప్రయాణాన్ని తెల్ల రేషన్ కార్డు ఉన్న పేద మహిళలకు మాత్రమే అవకాశం కల్పించాలన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం ద్వారా ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్న క్రమంలో వారికి రూ. 3వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బి.సదన్, లింగాల సురేష్,కె.యాదగిరి, అంజిబాబు, జ్యోతీ, కె.బాబు, రామాంజి, ఎల్లయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిస్తున్న పార్టీ నాయకులు

దేశపతి వ్యాఖ్యలు అర్ధరహితం

ప్రగతివేదిక రాష్ట్ర కన్వీనర్ రాంచంద్రారెడ్డి

దుబ్బాకటౌన్: వ్యక్తి ఆరాధన గురించి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని తెలంగాణ ప్రగతి వేదిక రాష్ట్ర కన్వీనర్ అమ్మన రాంచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాకలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కారణజన్ముడని దేశపతి శ్రీనివాస్ మాట్లాడడం వ్యక్తి ఆరాధన కాదా అని ప్రశ్నించారు. ముందుగా దేశపతి వ్యక్తి భజన మానుకోవాలన్నారు. నిగ్గదీసి అడిగే మొనగాడు రేవంతన్న అని కాంగ్రెస్ ఎన్నికల పాటల్లో ఉంటే కూడా సహించలేకపోవడం ఓర్వలేనితనమేనన్నారు. గత పదేళ్లుగా నోరుమూసుకొని.. ఇప్పుడు కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వారం రోజులకే సీఎం రేవంత్‌రెడ్డిపై మాట్లాడటం మానసిక పరిణితి అనిపించుకోదన్నారు. రాజధానిలో ధర్నా చౌక్ ఎత్తివేసినప్పుడు తెరవని నోరు ఇప్పుడు ఎందుకు లేస్తుందో ప్రజలు గమనిస్తున్నారన్నారు. తలుపులు బద్దలు కొట్టి ప్రొఫెసర్ కోదండరాంను బలవంతంగా లాక్కెళ్లి అరెస్టు చేసినప్పుడు ఈ సాహితీకారుడు ఎందుకు ప్రశ్నించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. మేధావి ముసుగులో ఏకపక్షంగా వ్యవహరిస్తే తెలంగాణ ప్రజలు క్షమించరన్నారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లయ్ అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో అక్రమంగా రవాణా చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి తనూజ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టామన్నారు. వట్టిపల్లి గ్రామానికి చెందిన కేతావత్ సైదా ఆయా గ్రామాల నుంచి సేకరించిన సుమారు వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తన ఇంటిలో నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పీడీఎస్ బియ్యం అమ్మినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమన్నారు. ఆమె వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌లు లావణ్య, స్వామి తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగిరం చేయాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణంలో పెండింగ్‌లో ఉన్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులు వేగిరం చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిపై ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో సమీక్షించారు. దుబ్బాక పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోందని, దీన్ని దృష్టిలో పెట్టుకొని కొత్తగా రింగ్‌రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఇందుకు అధికారులు వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. హబ్షీపూర్ నుంచి పట్టణం వరకు డబుల్ రోడ్డును నాలుగులేన్ల రోడ్డుగా, మిరుదొడ్డి మండలం అందె నుంచి దుబ్బాక మండలం తిమ్మాపూర్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. దశల వారీగా నియోజక వర్గంలో రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలకు సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, డీఈఈ వెంకటేశం, ఏఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చెరకుతోట దగ్ధం



దగ్ధమవుతున్న చెరుకు తోట

రామాయంపేట(మెదక్): మూడెకరాల చెరకు తోట దగ్ధమైన ఘటన మండలంలోని కోనాపూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన చంద్రారెడ్డి చెరకు తోటను కూలీలు నరుకుతున్నారు. అకస్మాత్తుగా పంట లోపలిభాగం నుంచి మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే అవి పొలమంతా అంటుకున్నాయి. వాటిని ఆపడానికి విఫలయత్నం చేశారు. ఆ మేరకు వారు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. కాగా సుమారుగా రూ. మూడు లక్షల వరకు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయారు.

అక్కన్నపేట దశ మారేనా?

- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు
- సొంత కార్యాలయాల కల నెరవేరేనా!
- పెండింగ్‌లో గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు
- మండలంలో ఇన్‌చార్జి అధికారులే దిక్కు

అక్కన్నపేట(హుస్నాబాద్): పొన్నం ప్రభాకర్ మంత్రి పీఠాన్ని అధిష్టించడంతో అక్కన్నపేట మండల అభివృద్ధిపై ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. జిల్లాలోనే అతి పెద్దమండలంతో పాటు, పల్లెలే కాకుండా సుమారు 55 వరకు గిరిజన తండాలున్నాయి. అక్కన్నపేట మండల కేంద్రంగా ఏర్పడి దాదాపు ఏడేళ్లు దాటుతున్నా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవు. దీంతో అటు అధికారులు ఇటు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

సమీకృత భవనం ఏదీ?

ఏ సమవేశం నిర్వహించుకుందామన్నా సరైన సమావేశ మందిరం లేదు. దీంతో అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత భవన నిర్మాణం కోసం గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అనేక సార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. స్థానిక వాటర్ ట్యాంక్ సమీపంలో ఉన్న సమీకృత భవన నిర్మాణానికి సర్వే నంబర్ 387లో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు.

అద్దె భవనాల్లోనే..

తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. అలాగే ఎంపీడీఓ కార్యాలయం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో కొనసాగిస్తున్నారు. అది కూడా శిథిలావస్థలో ఉన్న నాలుగు తరగతి గదులను మరమ్మతులు చేసి నెట్టుకొస్తున్నారు. మండల వనరుల కేంద్రం ప్రారంభించి వినియోగంలో తీసుకోరాలేదు. వ్యవసాయ, పంచాయతీ రాజ్ ఏఈ కార్యాలయాలు ఇంకా ఏర్పాటు చేయలేదు.




పాఠశాలలో కొనసాగుతున్న మండల పరిషత్ కార్యాలయం

కలగానే గౌరవెల్లి, గండిపల్లి..

మెట్టప్రాంత రైతుల చిరకాల కోరికైన గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణ పనులు ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. సుమారు 0.05 టీఎంసీల నీటిని మాత్రం ప్రాజెక్టులో నిల్వ చేశారు. కొంత మంది నిర్వాసితులు ఎన్‌జీటీని ఆశ్రయించడంతో చివరి దశలో ఆ ప్రాజెక్టు నిలిచిపోయింది. అదేవిధంగా గండిపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయకపోవడంతో కట్టపై ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అది కూడా కలగానే మిగిలిపోయింది.

అమలు కాని హామీలు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గౌరవెల్లి–గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు నీరందించాలని సంకల్పించారు. అయితే ప్రత్యేక రాష్ట్రం రావడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టుల డిజైన్ మార్చారు. తరువాత తోటపల్లి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి మెట్టరైతులకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. కాని ఆ ప్రభుత్వం పదేళ్లు పాలించినా ఆ హామీని నెరవేర్చలేదు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయిందని చెబుతున్నా ఇప్పటి వరకూడా కాలువల కోసం భూ సేకరణ కూడా పూర్తి చేయలేదు.



గౌరవెల్లి ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

మంత్రి దృష్టి సారించాలని..

మండలంలో ఎంఈఓ, వ్యవసాయశాఖ ఏఓ అధికారులు ఏడేళ్లుగా ఇన్‌చార్జిలే ఉన్నారు. కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ భవన నిర్మాణం పూర్తిచేయడంలో పాలకులకు పట్టడం లేదు. వ్యవసాయ పనుల్లో ఎప్పటికప్పుడు రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు పర్మినెంట్ ఏఓ ఉండాలని సర్పంచులు ప్రతి సర్వసభ్య సమావేశంలో డిమాండ్ చేస్తున్నారు. కాని ఫలితం లేకుండా పోయింది. హుస్నాబాద్ నియోజకవర్గానికి తొలిసారిగా మంత్రి పదవి వరించిన నేపథ్యంలో ఈ పనులన్నీ పూర్తవుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు. ఆ దిశగా మంత్రి ప్రత్యేక దృష్టి సారించి సమస్యలన్నీ పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

చెట్లు నరకవద్దు.. జీవరాశులు ఎట్లా బతకాలె..

- చెట్టు ఎక్కి బాలుడు నిరసన
- రాత్రి అయినా దిగని వైనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చెట్లను నరకవద్దంటూ ఓ బాలుడు చెట్టు ఎక్కి నిరసన తెలిపిన ఘటన రామచంద్రాపురం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పట్టణంలోని కాకతీయ నగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ కుమారుడు అనిరుద్ ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాకతీయనగర్‌లో రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా చెట్టును తొలగించేందుకు సొసైటీ సభ్యులు అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారు. ఈ చెట్టును తొలగించేందుకు ఉదయం కాంట్రాక్టర్ అక్కడికి చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అనిరుద్ చెట్టుని నరికి వేస్తే మనకు ఆక్సిజన్ ఎలా వస్తుంది? జీవరాశులు ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా చెట్టు పైకి ఎక్కి కూర్చున్నాడు. చెట్టును తొలగించబోమని లిఖితపూర్వకంగా ఇస్తేనే చెట్టు దిగుతానని భీష్మించుకొని కూర్చున్నాడు. బాలుడి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు ఎంత బతిమిలాడినా తనకు హామీ ఇస్తేనే కిందకు దిగుతానని చెప్పాడు. ఈ సందర్భంగా అనిరుద్ మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో తన తండ్రితో కలిసి భెల్ కాలనీలో తమ సొంత డబ్బులతో 150 మొక్కలను నాటామని తెలిపాడు. మన అవసరాలకు చెట్లను నరకడం వల్ల భవిష్యత్తులో మనమే బాధపడాల్సి వస్తుందని బాలుడు ఆవేదన వ్యక్తం చేశాడు. చెట్ల వద్దకు అనేక ఉడతలు, పక్షులు వస్తుంటాయని తెలిపాడు. వాటికోసం ఓ పాత్రలో నీటిని ఉంచడంతోపాటు ఆహారాన్ని కూడా అందిస్తామని తెలిపారు. ఈ చెట్టు నరికేయడం వల్ల మూగజీవాలు ఎక్కడికి పోతాయని బాలుడు ప్రశ్నించాడు. రాత్రి అయినప్పటికీ ఆ బాలుడు చెట్టు మీదే కూర్చున్నాడు. బాలుడు తండ్రి ప్రవీణ్ మాట్లాడుతూ తన కుమారుడు అనిరుద్‌కు మొక్కలు అంటే ప్రాణమని తెలిపారు. చెట్ల వద్దకు వచ్చే జీవుల కోసం నిత్యం మట్టి పాత్రల్లో నీళ్లు పోసి పెట్టేవాడని తెలిపారు. తమ కుమారుడు ఆహారం తినకుండా చెట్టు ఎక్కి కూర్చున్నాడని చెప్పాడు.



చెట్టు ఎక్కి కూర్చున్న బాలుడు అనిరుద్

ఫ్రాన్స్‌లో ప్రపంచ నైపుణ్య పోటీలు

సంగారెడ్డి టౌన్: ఫ్రాన్స్ లోని లియోన్స్ నగరంలో ప్రపంచ నైపుణ్య పోటీలు జరగనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వందన తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా, రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఆటోబాడీ రిపేర్, ఆటోమొబైల్, టెక్నాలజీ బేకరీ, బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్, మొబైల్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటరింగ్ వంటి 50కి పైగా నైపుణ్యాలతో పోటీపడే అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బస్సు డ్రైవర్ల నిరసన

- డిపోకే పరిమితమైన 59 పల్లెవెలుగు బస్సులు
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు

మెదక్: టేక్మాల్ టు బొడ్మట్‌పల్లి రూట్ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడికి యత్నించడాన్ని వ్యతిరేకిస్తూ డ్రైవర్లు నిరసన తెలిపారు. మంగళవారం మెదక్ డిపో నుంచి 59 ప్రైవేటు పల్లెవెలుగు బస్సులను డిపోకే పరిమితం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమపై ప్రయాణికులు అకారణంగా దాడులకు పాల్పడుతున్నారన్నారు. వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. నిబంధనల ప్రకారమే బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. అయితే ఉచిత ప్రయాణంతో బస్సులో కాలు పెట్టలేనంతగా జనం ఎక్కుతున్నారని తెలిపారు. ఒక బస్సులో 56 మంది ప్రయాణికులకు సరిపడా సీట్లు ఉండగా 180–200 మంది ఎక్కుతున్నారన్నారు. స్త్రీలు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ నిలబడుతున్నారని వివరించారు. పొరబాటు కింద పడితే తమ ఉద్యోగాలకు ముప్పు ఉందని తెలిపారు. కాగా, బస్సులను డిపోకే పరిమితం చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం మెదక్ నుంచి టేక్మాల్ మీదుగా బొడ్మట్ పల్లి బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడు కర్రతో దాడి యత్నించగా పోలీసులకు ఫిర్యాదు చేయడం తెలిసిందే.



డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారి

పల్లవి ప్రశాంత్‌పై కక్షసాధింపు తగదు

- ప్రజల హృదయాలను గెలుచుకున్న యువకునికి ఇదేనా బహుమానం
- పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సీఎంకు ఫిర్యాదు చేస్తాం
- హైకోర్టు న్యాయవాది డాక్టర్ రాజేశ్‌కుమార్
- ప్రెస్‌మీట్‌లో కంటతడిపెట్టుకున్న తల్లిదండ్రులు

గజ్వేల్: కోట్లాదిమంది తెలుగు ప్రజల హృదయాలను గెలుచుకున్న బిగ్‌బాస్ సీజన్–7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌పై కక్షసాధింపు చర్యలు తగవని హైకోర్టు న్యాయవాది డాక్టర్ కే రాజేశ్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రశాంత్ తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మలతో కలిసి సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో చోటుచేసుకున్న ఘటనల నేపథ్యంలో ప్రశాంత్‌పై వివిధ సెక్షన్లతో కేసు నమోదైనట్లు మీడియాలో కథనాలు వస్తున్నా...ఇప్పటివరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఆన్‌లైన్‌లో పెట్టలేదని తెలిపారు. అరెస్ట్ చేస్తారనే భయంతో ప్రశాంత్‌తోపాటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సామాన్య రైతుబిడ్డగా వెళ్లి బిగ్‌బాస్ టైటిల్‌ను గెలుచుకున్న యువకునికి ఇచ్చే గౌరవం ఇదేనా? అంటూ ప్రశ్నించారు. ప్రశాంత్ విజేతగా నిలవడం ఇష్టంలేని కొన్ని శక్తులు నగరంలో జరిగిన సంఘటనలకు కారణమన్న అనుమానం నెలకొందన్నారు. ఈ విషయంలో నిజాలు నిగ్గు తేల్చాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. చట్ట ప్రకారం పోలీసులు వెళ్తే తాము అడ్డు పడబోమని, కానీ ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లయితే వెంటనే పోలీసుశాఖ వెబ్‌సైట్‌లో ఎఫ్ఐఆర్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. పల్లవి ప్రశాంత్ విజేతగా నిలిచిన ఆనందాన్ని కోల్పోయి.. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసుకొని ఎవరికి అందుబాటులో లేకుండా వెళ్లిపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. అతనికి అండగా ఉంటూ న్యాయసహాయం అందిస్తానని తెలిపారు.



పల్లవి ప్రశాంత్ తల్లి విజయమ్మను ఓదారుస్తున్న హైకోర్టు న్యాయవాది రాజేశ్‌కుమార్

తల్లిదండ్రులు కంటతడి..

తమ కొడుకుపై కక్షసాధిస్తున్నారని విలేకరుల సమావేశంలో పల్లవి ప్రశాంత్ తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మలు కంటతడి పెట్టుకున్నారు. చిన్నప్పటి నుంచి ప్రశాంత్ ఎంతో కష్టపడి చివరకు తానూ అనుకున్నదని సాధించాడని, కానీ ఈ సంతోషం కొన్ని గంటలు కూడా నిలవలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కేసులు పెట్టి అరెస్ట్ చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అండగా నిలవాలని వారు కోరారు.

మెరుగైన సమాజ నిర్మాణ బాధ్యత అధ్యాపకులదే



బటర్ ఫ్లయ్ గార్డెన్ గురించి వివరిస్తున్న డాక్టర్ అయోధ్య రెడ్డి

- న్యాక్ పీర్ టీం ఛైర్మన్ హోసియర్ దామి

సిద్దిపేట ఎడ్యుకేషన్: మెరుగైన సమాజ నిర్మాణ బాధ్యత అధ్యాపకులదేనని న్యాక్ పీర్ టీం ఛైర్మన్ హోసియర్ దామి అన్నారు. న్యాక్ పీర్ టీం సందర్శనలో భాగంగా రెండవ రోజు మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)ను సందర్శించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ పరికరాలను ఏ విధంగా వినియోగిస్తున్నారో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు, వార్తాపత్రికలను, ఆన్‌లైన్ పత్రికలు, డిజిటల్ ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. బోధన సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం హోసియర్ దామి మాట్లాడుతూ కాలానుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ బ్రజ్ భూషణ్ ఓజా మాట్లాడుతూ బోధనతోపాటు సంస్కారం, సాంస్కృతిక, చారిత్రక అంశాలను జోడించి జాతీయ సమగ్రతకు కృషి చేయాలన్నారు. న్యాక్ పీర్ టీం సభ్యుడు అయ్యపిల్లై సెల్వమణి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీసి ఉపాధి పెంచే విద్యను ప్రవేశపెట్టి జాతీయ ఆదాయాన్ని పెంచాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వాసం శ్రీనివాస్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

కొడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో ఆత్మహత్యకు విఫలయత్నం చేసిన రైతు ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై మరణించాడు. ఈ సంఘటన కొడిపల్లి మండలం శేరితండాలో జరిగింది. ఏఎస్ఐ విఠల్ కథనం ప్రకారం.. తండాకు చెందిన అజ్మీర దీప్ల(57)కు ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. చిన్న కూతురి పెళ్లికి, వ్యవసాయ బోర్లు వేసేందుకుగాను తెలిసిన వారు, బంధువుల నుంచి రూ.ఐదు లక్షల అప్పులు తెచ్చాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక లోలోన అంతర్మథనం చెందుతున్నాడు. ఈనెల 10న రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన భార్య శాంతి, కొడుకు.. అతడిని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఇక్కడ చికిత్స తీసుకొన్న తర్వాత ఇంటికి తిరిగొచ్చారు. సాయంత్రం అతను అస్వస్థతకు గురయ్యాడు. స్థానికంగా ఒక హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందని వైద్యుడు తెలిపాడు. మృతుడి కొడుకు నగేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి..

గడ్డిమందు తాగి భర్త మృతి

నర్సాపూర్‌రూరల్: భార్యతో గొడవ పడి గడ్డిమందు తాగి భర్త మృతిచెందిన ఘటన కొల్చారం మండలం రెడ్డిపల్లిలో ఆలస్యంగా మంగళవారం వెలుగుచూసింది. నర్సాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని రంగంపేటకు చెందిన సారా చంద్రశేఖర్‌కు, నర్సాపూర్ మండలం రెడ్డిపల్లికి చెందిన సమంతతో 2019లో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒక ఏడాది నుంచి భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. దీంతో సమంత తరచుగా పుట్టింటి వెళ్లిపోయేది. ఈ విషయమై ఆరు సార్లు గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించారు. అప్పటికే ఆమె తన పుట్టింట్లో ఉండగా పిల్లలను చూసి వస్తానని చంద్రశేఖర్ వెళ్లాడు. అక్కడ మరోసారి ఇద్దరూ గొడవపడ్డారు. మనస్తాపం చెందిన అతను గడ్డిమందు తాగాడు. కుటుంబీకులు వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స పొందిన అనంతరం సూరారంలోని నారాయణ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జాము మృతిచెందాడు. కొడుకు మృతి అనుమానాస్పదంగా ఉందని పోలీసులకు తండ్రి సారా యాదయ్య ఫిర్యాదు చేశారు.



చంద్రశేఖర్

బొలేరోను ఢీకొన్న లారీ

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

చేగుంట(తూప్రాన్): ఆగి ఉన్న బొలేరోను లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మాసాయిపేట శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్ర అనకాపల్లి జిల్లా కొత్తూరు మండలానికి చెందిన వారు చిక్కం మురళి(50), బంగారునాయుడు. ఈనెల 17న వారు అనంతపురంలో హైడ్రాలిక్ వస్తువుల లోడు తీసుకొని బొలేరోలో మధ్యప్రదేశ్‌కు బయలుదేరాడు. మాసాయిపేట శివారు వద్ద ఒక పెట్రోల్ బంకు వద్ద వాహనం ఆపి నిద్రిస్తున్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న లారీ, ఆగి ఉన్న బొలేరోను ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని స్థానికులు కొంపల్లిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అందులో చికిత్స పొందుతూ మురళి మంగళవారం రాత్రి మరణించాడు. ఈ మేరకు కేసును ఎస్ఐ హరీశ్ దర్యాప్తు చేస్తున్నారు.



మురళి(ఫైల్)

రెండు బైకులు ఢీ.. ఒకరు మృతి

కోహీర్(జహీరాబాద్): ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ప్రమాదం కోహీర్–బిలాల్‌పూర్ రోడ్డుపై మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కిష్టయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురుజువాడకు చెందిన బ్యాగరి గోపాల్ బైక్‌పై పైడిగుమ్మల్ గ్రామంలో ఉంటున్న తన కూతురు ఇంటికి వెళ్తున్నాడు. కోహీర్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీ సమీపానికి రాగానే ఎదురుగా మరో బైక్ వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాల్ తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక ఉన్న యువకుడు తుకారాం గాయపడ్డాడు. మృతుడికి నలుగురు కూతుళ్లు, కొడుకు ఉన్నాడు. కూతుళ్లందరికీ వివాహమైంది. క్రిస్మస్ పండగకు కూతురు, అల్లుడిని పుట్టింటికి తీసుకురావడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య మాణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

- పుల్లూరు వద్ద పట్టుబడిన నిందితులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ సురేందర్ రెడ్డి

సిద్దిపేట రూరల్: మహిళల మెడలో నుంచి బంగారు ఆభరణాలు లాక్కుని వెళ్తున్న అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ సురేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం సిద్దిపేట రూరల్ ఎస్సై తన సిబ్బందితో పుల్లూర్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన దొంగలు మ్యాన శివ, కూరపాటి నరేశ్‌లు నంబర్ ప్లేట్ లేని హోండా యాక్టివా పై అనుమాస్పదంగా వస్తున్న వారిని ఆపి విచారించారు. వీరు సుమారు ఆరు నెలల క్రితం సిద్దిపేట వన్‌టౌన్ పరిధిలో నాసర్‌పురలో ఓ వృద్ధురాలు ఒంటరిగా ఇంట్లో పడుకొని ఉండగా.. మూడు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కెళ్లినట్లు చెప్పారు. అలాగే రెండు నెలల క్రితం ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో ఒంటరి వృద్ధురాలు తన ఇంటి ఎదుట కూర్చొని ఉండగా మెడలో నుండి రెండు తులాల బంగారు పుస్తెల తాడు లాక్కొని వెళ్లినట్లు వారు ఒప్పుకున్నారు. అదేవిధంగా నవంబర్‌లో రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఫిర్యాది దగ్గుల అగవ్వ పొలం వద్ద ఒంటరిగా ఉండగా మెడలో నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడును కూడా ఈ దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఏసీపీ తెలిపారు. ఆ దొంగలు వాడుతున్న స్కూటీని కూడా గతంలో వేములవాడ టెంపుల్ వద్ద నరేష్ దొంగతనం చేసినట్లు తెలిసిందన్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి, రూరల్ సీఐ చేరాలు, ఎస్సై కిరణ్ రెడ్డి, కానిస్టేబుళ్లు రవిరాజు, రాజు, పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ సురేందర్‌రెడ్డి

యువకుడి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెల్లాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు. మెదక్ జిల్లా చేలపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ (19) జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు వలస వచ్చాడు. ఇంద్రానగర్ కాలనీలో ఉంటూ కూలీ పనులు చేస్తుంటాడు. కాగా, సోమవారం రాత్రి అతని గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మల్లేష్ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

పెళ్లి కావడం లేదని..

జహీరాబాద్: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని శేఖాపూర్‌లో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రవీందర్ (24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. తల్లిదండ్రులు చిన్నతనంలోనే మరణించడంతో నానమ్మ తుల్జమ్మ వద్ద ఉండేవాడు. వివాహం అవుతుందో లేదోనని ఈనెల 18వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రవీందర్ పురుగుల మందు తాగాడు. ఈ విషయం వరుసకు తమ్ముడైన ప్రసాద్‌కు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే అతన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రవీందర్(ఫైల్)

19 మంది జూదరుల అరెస్ట్

నర్సాపూర్ రూరల్: పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నర్సాపూర్ మండలం నత్నాయ్యపల్లి అటవీ ప్రాంతంలోని వడ్డెరగూడెంలో కొందరు పేకాట ఆడుతున్నారు. తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజాము పోలీసులు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 19 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి నుంచి రూ.1.47 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.